క్లుప్తంగా

ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఎన్నిక

ఒంగోలు టౌన్: ఏఐటీయూసీ జిల్లా కమిటీని ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్లో నిర్వహించిన జిల్లా మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సయ్యద్ యాసిన్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షునిగా సయ్యద్ సర్దార్, వర్కింగ్ ప్రెసిడెంట్గా కె.హనుమంతరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్కే ఖాశీం, ఉపాధ్యక్షులుగా సుభాస్ నాయుడు, కె.జీవరత్నం, మల్లికార్జునరావు, షేక్ ఇబ్రహీం, పీవీఆర్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 25 మందిని సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శి జి.ఓబులేసు ప్రసంగించారు.

వివాహిత అదృశ్యం

ఒంగోలు టౌన్: భర్తతో మనస్పర్థల కారణంగా వేరుగా నివాసం ఉంటున్న ఓ వివాహిత అదృశ్యమైంది. ఒంగోలు మండలంలోని ఎన్.అగ్రహారంలో నివాసం ఉంటున్న తోటకూర రాంబాబు ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో భార్య నాగ మల్లేశ్వరి న్యూట్రీషియన్ కోర్సు చదువుతానని చెప్పి ఒంగోలులోని ఎన్జీవో కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని తండ్రితో కలిసి ఉంటోంది. శనివారం రాత్రి తండ్రికి టిఫిన్ తీసుకొస్తానని చెప్పి వెళ్లిన నాగమల్లేశ్వరి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం స్థానిక తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెవిటి, మూగ, విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: చీమకుర్తి పట్టణంలోని ఎస్కేఆర్ చెవిటి, మూగ ప్రత్యేక పాఠశాలలో 2023–24లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆంజనేయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6–18 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన చెవిటి, మూగ విద్యార్థులు, పుట్టుక నుంచి వినికిడి, మాటలు సరిగరానివారు 1–10వ తరగతి వరకు ప్రత్యేక విద్యను అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9505060361, 9440336730 సంప్రదించాలన్నారు.

జనపనార సంచుల తయారీ కేంద్రం పరిశీలన



సూచనలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువపెట్ట అటవీశాఖ ఆధ్వర్యంలో జనపనార సంచుల తయారీ కేంద్రాన్ని విజిలెన్స్ పీసీసీ ఎఫ్ డా. కె. గోపినాథ్ ఆదివారం సందర్శించారు. సంచుల తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎఫ్వోలు వినీత్కుమార్, నరసింహారావు, శివశంకరరెడ్డి, ఎఫ్ఆర్వో జీవన్ కుమార్, డిఆర్వో వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

వర్షంతో హర్షం



మార్కాపురంలో కురుస్తున్న వర్షం

మార్కాపురం టౌన్: ఇటీవల ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు ఆదివారం కురిసిన మోస్తారు వర్షంతో కొంత మేర చల్లబడ్డారు. గత కొన్ని రోజులుగా ఎండ 40 నుంచి 45 వరకు ఖాయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండతో పాటు సాయంత్రం వర్షం కురవటంతో కాస్త ఉపశమనం కలిగింది. పట్టణంతో పాటు దరిమడుగు పరిసర గ్రామాల్లో ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది.

జేఈఈ అడ్వాన్స్లో విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ వెంకట రమణారెడ్డి

ఒంగోలు: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో తొలిసారిగా జిల్లా నుంచి సత్తాచాటామని, ఒంగోలు రికార్డును తిరగరాయడంగా దీన్ని భావిస్తున్నామని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఆవుల వెంకట రమణారెడ్డి అన్నారు. జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు ఆదివారం విడుదలవడంతో స్థానిక శ్రీసరస్వతి కాలేజీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి విష్ణుమాధవ్ జాతీయస్థాయిలో 2,741వ ర్యాంకు, మానం నరసింహ 3,629వ ర్యాంకు కైవసం చేసుకున్నారన్నారు. విలేకరుల సమావేశంలో కాలేజీ డైరెక్టర్లు ఆవుల గణేష్రెడ్డి, ఆవుల గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్వీ సురేష్, డీన్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

శ్రీప్రతిభ విద్యార్థికి 3,461వ ర్యాంకు...



టంగుటూరు మండలం ఎం.నిడమానూరుకు చెందిన తమ కాలేజీ విద్యార్థి. చేగొండి మదన్కుమార్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 3,461వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022లో తమ కాలేజీ నుంచి నాగండ్ల కృష్ణచైతన్య 1,214వ ర్యాంకు, 2021లో కంటు కుసుమిత 3,345వ ర్యాంకు, 2019లో కొండమూరి మదన్ 599వ ర్యాంకు, మక్కెన సుదర్శన్ 2,017వ ర్యాంకు, కొప్పోలు అఖిల్ 2,551వ ర్యాంకు సాధించారన్నారు. మదన్కుమార్ను చైర్మన్తోపాటు వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ అభినందించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న బాలినేని ప్రణీత్రెడ్డి

ఒంగోలు: స్థానిక క్లబ్ స్క్వేర్లో హోప్ యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్రెడ్డి ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. సంస్థ ఆర్గనైజర్ షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు ఫైనల్ మ్యాచ్కు ప్రణీత్రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై తిలకించారు. విజేతగా నిలిచిన జట్టును అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలంటే తనకు చాలా ఇష్టమన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని యువతను ఉత్సాహపరిచే విషయంలో తాను ముందుంటానన్నారు. ఎలాంటి క్రీడా పోటీలు ప్రారంభించినా తన వంతు సాయం తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి బుజ్జి, షేక్ మాబు, శ్రీను, చరణ్, అల్తాఫ్, వాసు, సాయి, హోప్టీం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవాలు



పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

చీమకుర్తి: సంతనూతలపాడులో గొలగలమూడి వెంకయ్యస్వామి, బైనబోయినస్వామి ఆరాధన మహోత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు చెన్నై ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం విశేష పూజల అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖాదర్బాషాకు సామాజిక సేవారత్న పురస్కారం



ఖాదర్బాషాను సత్కరిస్తున్న నిర్వాహకులు

చీమకుర్తి: ముస్లిం డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్బాషాకు లిటిల్ చాంప్స్ అకాడమీ, ఏపూరి బ్రదర్స్ గుడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారంతో పాటు శాలువా కప్పి సత్కరించి ప్రశంసపత్రాన్ని అందజేశారు. ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు తనకు ఈ పురస్కారాన్ని అందించినట్లు ఖాదర్బాషా తెలిపారు.

మంచినీటి పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న రమేష్

ఒంగోలు టౌన్: ఒంగోలు ప్రజల దాహార్తి తీర్చేందుకు సాధ్యమైనంత త్వరగా మంచినీటి పథకాన్ని పూర్తి చేయాలని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంచినీటి సమస్య పరిష్కార మార్గాలు అనే అంశంపై స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం రౌండ్టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు దామా శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. గుండ్లకమ్మ శాశ్వత మంచినీటి పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని, కొప్పోలు, పేర్నమిట్ట, పెళ్లూరు చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా మార్చాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ కోరారు. పైపు లీకేజీలను అరికట్టాలని, స్పేర్ మోటార్లను ఉంచుకోవాలని, ఎస్ఎస్ ట్యాంకుల వద్ద నిరంతరం విద్యుత్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని శివారు ప్రాంతాల్లో పైపులైను వేసి మంచినీరు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ సీనియర్ నాయకుడు ఉప్పుటూరు ప్రకాష్రావు కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు తంబి శ్రీనివాసరావు, మారెళ్ల సుబ్బారావు, టీబీఎస్ రాజు, శ్రీరాం శ్రీనివాసులు, దారా వెంకటేశ్వర్లు, జి.నరసయ్య, పి.నరసింహారావు, ఎం.శ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నోట్బుక్స్ పంపిణీ



నోట్బుక్స్ పంపిణీ చేస్తున్న దోస్తీ ఫౌండేషన్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: సమాజసేవకు మించిన ఆత్మసంతృప్తి మరొకటి లేదని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆంజనేయులు వీధిలో ఉన్న మినిస్ట్రీ అంధుల పాఠశాలలో దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో దోస్తీ ఫౌండేషన్ మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. మానవత్వంతో చేసే సాయం సమాజాభివృద్ధికి తోడ్పడుతుందని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో జడ శ్రీనివాసరావు, కుమార్, స్వర్ణ మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఉపయోగాలు

అద్దంకి: భూసార పరీక్ష చేయించడం ద్వారా తగ్గిన సూక్ష్మ పోషకాల భర్తీతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో రైతు పొలాల్లో భూసార పరీక్షకోసం నమూనా మట్టిని సేకరించారు. ఏవో మాట్లాడుతూ మండలంలో మొత్తం 558 శాంపిల్స్ సేకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ షారోన్ రోజీ పాల్గొన్నారు.

నాలుగో తరగతి వసతి గృహాల సంఘ అధ్యక్షునిగా ఆంద్ర



నూతన అధ్యక్షుడు తిరుపతయ్యను అభినందిస్తున్న నాయకులు

ఒంగోలు: ఏపీ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాల నాలుగో తరగతి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, రోజువారీ వేతన ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షునిగా ఆంద్ర తిరుపతయ్య ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మంజుల, కోశాధికారి సీహెచ్ రవికిషోర్, గౌరవాధ్యక్షుడు ఎం.ఆంబ్రోస్ పర్యవేక్షించారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా మిటనసల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దాసరి ప్రేమ్కుమార్, కోశాధికారిగా నక్కా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా జమ్మలమడుగు ఇస్సాక్, సహాయ కార్యదర్శిగా దుడ్డు మార్క్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.రామయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన కమిటీ మూడు సంవత్సరాల పాటు ఉంటుందని, సభ్యుల ఆకాంక్ష మేరకు పనిచేయాలని సూచించారు.



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు



కొనకనమిట్ల: అలంకరణలో అంకాలమ్మ తల్లి



మార్కాపురం: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



ప్రభపై మాట్లాడుతున్న జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఉడుముల

వైభవంగా అంకాలమ్మ తల్లి జాతర

కొనకనమిట్ల: అంకాలమ్మతల్లి జాతర పురస్కరించుకొని మండల కేంద్రం కొనకనమిట్లలో శని, ఆదివారాల్లో భక్తులు వేలాదిగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బోనాలతో ఆలయం వద్దకు వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ముందుగా అమ్మవారి కలశ ఉత్సవం నిర్వహించి భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంకాలమ్మ తల్లిని జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరవరపు పెదవెంకటరెడ్డి, పునుగోటి కొండారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, కల్లం దిబ్బారెడ్డి, పగడాల తిరుపతిరెడ్డి, భూషణం, శిగినం కొండయ్య, యలమందారెడ్డి ఆధ్వర్యంలో రెండు, టీడీపీ తరపున ఒకటి, ఉప సర్పంచ్ మెట్టు అల్లూరురెడ్డి తరపున మొక్కుబడి ప్రభ కలుపుకొని మొత్తం నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పొదిలి సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్ఐ కదలి దీపిక తమ సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మాటిచ్చాడంటే.. చేస్తాడంతే..

ప్రజా రంజకంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజల కోసం ఏదైనా మాటిస్తే తప్పక నెరవేరుస్తాడని జెడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ స్పష్టం చేశారు. అంకాలమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని మండల కేంద్రం కొనకనమిట్లలో శనివారం రాత్రి గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆమె ప్రసంగించారు. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధితో పాటు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని ఆమె అన్నారు. తొలుత వెంకాయమ్మ, ఉడుములను గ్రామ పార్టీ నాయకులు శాలువా, పూలతో సత్కరించారు. ఎంపీపీ మోరబోయిన మురళీ కృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్రెడ్డి, సర్పంచ్ శిగినం లక్ష్మీతిరుపతమ్మ, కొండయ్య, ఎంపీటీసీ కల్లం సుబ్బమ్మ, దిబ్బారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు యక్కంటి తిరుపతరెడ్డి, పగడాల తిరుపతిరెడ్డి, పగడల వెంకటేశ్వర రెడ్డి భూషణం, చినపరెడ్డి యలమందారెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఎస్సీ, బీసీసెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, శిగినం కొండయ్య, పాలూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్రెడ్డి పర్యవేక్షించారు.

గుంటి గంగా భవానికి విశేష పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ఏడు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 5,540 ఆదాయం వచ్చినట్లు ఆర్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

చల్లగా దీవించు తల్లీ

పుల్లలచెరువు: చల్లగా దీవించుతల్లీ అంటూ మండలంలోని ఉమ్మడివరంలో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం వస్తే గ్రామల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగా ఉమ్మడివరం గ్రామ దేవతలైన గంగమ్మ తల్లి, పోలేరమ్మ తల్లికి గ్రామప్రజలు ఊరేగింపుగా బోనాలు చేత పట్టుకుని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మా తల్లీ సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలతో తులతూగాలని దీవించుతల్లీ అంటూ మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణ నెలకొంది.



కొనకనమిట్ల: బూచేపల్లి వెంకాయమ్మను సన్మానిస్తున్న నాయకులు



ఉమ్మడివరంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.



కొనకనమిట్ల: ఆలయం వద్ద భక్తుల సందడి

త్రిపురాంతకంలో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలలో అమావాస్య ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.